క్లుప్తంగా

పోలేరమ్మ, చౌడమ్మకు ఒడి బియ్యం



శోభాయాత్రలో మహిళల కోలాట ప్రదర్శన

పోరుమామిళ్ల : పట్టణంలోని గ్రామ దేవతలు కోట పోలేరమ్మ, చౌడమ్మకు మంగళవారం మహిళాభ్యుదయ సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఘనంగా ఒడి బియ్యం (సారె కార్యక్రమం) నిర్వహించారు. తంబాబావివీధి, బ్రాహ్మణవీధి, మూలవీధి, శీనప్ప బావివీధితో పాటు పలు వీధులకు చెందిన మహిళలు గ్రామదేవతలకు ఒడి బియ్యం తీసుకొని, పసుపు, కుంకుమలతో కోలాట ప్రదర్శనతో భారీ శోభా యాత్ర నిర్వహించారు. గ్రామదేవతలకు పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

బ్రహ్మంగారి హుండీల లెక్కింపు



బ్ర.మఠంలో హుండీలను లెక్కిస్తున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం : కాలజ్ఞాన ప్రబోధ కర్త పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో మంగళవారం హుండీలను లెక్కించారు. ఒకటిన్నరనెలలో స్వామికి కానుకల రూపంలో రూ. 22,21,090 వచ్చినట్లు మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ జిల్లా అధికారి, మఠం పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, తిరుమలతిరుపతి దేవస్థానం ఇన్‌స్పెక్టర్ ఫణిరాజా, పూర్వపు మఠాధిపతి సతీమణి మారుతీ మహాలక్షుమ్మ, పూర్వపు మఠాధిపతి పెద్దకుమారుడు వెంకటాద్రిస్వామి. ఆలయ సిబ్బంది, ఏపీజీబీ బ్యాంక్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యూఓ గురుప్రసాద్

ప్రొద్దుటూరు : విద్యార్థుల సమస్యలను అధికారులు పరిష్కరించాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక కన్వీనర్ నాగరాజు కోరారు. ఆయన ఫిర్యాదు మేరకు ఏఎస్‌డబ్ల్యూఓ గురుప్రసాద్ మంగళవారం స్థానిక ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా నాగరాజు ఏఎస్‌డబ్ల్యూఓకు సమస్యలను వివరించారు. అన్నంలో పురుగులు కనిపిస్తున్నాయని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని కోరారు.

6న సర్వసభ్య సమావేశం

గోపవరం : మండల సర్వసభ్య సమావేశంలో ఆగస్టు 6వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాధాకృష్ణన్ తెలిపారు. ఎంపీపీ ధనలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని సూచించారు. అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించాల్సి ఉందని, అధికారులు గైర్హాజరు కాకుండా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

ప్రొద్దుటూరు : ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైవీఎస్ మున్సిపల్ బాలికల హైస్కూల్, వైఎంఆర్ కాలనీలోని అరబిందో ఇంటిగ్రల్ హైస్కూల్‌లో సీజనల్ వ్యాధులు, స్టాఫ్ డయేరియా, కుష్టు వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల వృద్ధి ఎక్కువగా ఉంటుందని, ఇంటి పరిసరాల్లో నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు భోజనం తినే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శివప్రసాద్ రెడ్డి, డాక్టర్ హిమబిందు, డీపీఎంఓ శివశంకరయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తొలగింపు

మున్సిపాలిటీ పరిధిలోని సుందరాచార్యుల వీధిలో ఉన్న డ్రైనేజీ కాలువ పూడికను తొలగిస్తున్నారు. ఎప్పటి నుంచో ఈ కాలువ చెత్తా చెదారంతో పూడిపోయి ఉంది. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి మంగళవారం పర్యవేక్షించారు.

చినుకు.. కినుకు

కార్తెలు కరిగిపోతున్నాయి. వానాకాలం వచ్చి రెండు నెలలు దాటిపోతున్నా.. కారుమబ్బులు దోబూచులాడుతున్నాయే తప్ప పదును వాన పడలేదు.
చినుకు రాలదు.. చింత తీరదు.. అన్నట్లుగా ఉంది రైతుల పరిస్థితి. ముందు మురిపించిన వర్షానికి వరి నాటేందుకు పచ్చిరొట్టను సాగు చేశారు. భూమిలో తడి ఆరిపోతోంది. భూగర్భ జలాలు పడిపోతున్నాయి. అదును దాటిపోతుండడంతో వానల కోసం అన్నదాత ఆశగా ఆకాశానికేసి చూస్తున్నాడు.

- కారుమబ్బుల దోబూచులాట
- వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతన్నలు
- అడుగంటిన భూగర్భజలాలు



మాధవరాయునిపల్లెలో ముదురుతున్న నారుమడి

బి.కోడూరు : ఆకాశంలో మేఘాలు కమ్ముకుని వర్షాలు కురిసే విధంగా ఉన్నా నీలిమేఘాలు మాత్రం కారుమబ్బులతో దోబూచులాడుతున్నాయి. వరుణుడు మొహం చాటేశాడు. వానొచ్చేలా ఆకాశంలో మబ్బులు కన్పిస్తున్నా వర్షించడం లేదు. చినుకు కోసం అన్నదాతలు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్‌ను ఎలా గట్టెక్కించాలోనని మధనపడుతున్నారు. ఈ సీజన్‌లో పంటల సాగు కోసం అన్ని సమకూర్చుకుని వర్షాల కోసం రైతన్న ఎదురుచూస్తున్నాడు. వర్షం కురవకపోవడంతో పంటల సాగుకు అదును దాటుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆందోళనలో అన్నదాత

మండలంలోని రైతులు కేవలం వర్షాధార పంటలపైన ఆధారపడి జీవిస్తున్నారు. మండలంలోని మేకవారిపల్లె, పాపనపల్లె, మరాటిపల్లె, మాధవరాయునిపల్లె, ఐత్రంపేట, అమ్మవారిపేట, బి.కోడూరు, రామసముద్రం, పెద్దుళ్లపల్లె తదితర గ్రామాల్లో బోరుబావుల కింద వరిపంటను సాగు చేసేందుకు నారుమడులను సిద్ధం చేసుకుని జీలగ, పిల్లిపెసర, జనుము సాగు చేశారు. కానీ అదును దాటుతున్నా సరైన వర్షం రాకపోవడంతో భూగర్భజలాలు తగ్గిపోతున్నాయి. దీంతో వరిపంటను సాగు చేసేందుకు రైతులకు ధైర్యం చాలడం లేదు. ఒక పక్క రైతులు వేసిన నారుమళ్లు ముదురుతుంటే రైతుల గుండె చెదురుతుంది. గతేడాది బోరుబావుల కింద వరిని సాగు చేశారు. ఈ ఏడాది కూడా వర్షం రాకపోతుందా అన్న ఆశతో వరి నాటేందుకు పొలాలను సిద్ధం చేసుకున్నారు. వర్షం కురవకపోతే నారుమళ్లు వదిలేయాల్సి వస్తుందని రైతన్న వాపోతున్నాడు. కొన్ని చోట్ల చిన్నపాటి వర్షాలకు విత్తుకున్న పొలాల్లో మొలకలు ఎండుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితులతో ఏటా ఏదో రకంగా రైతులను క్షామం వెంటాడుతూనే ఉంది.

వరి సాగు కష్టమే



గతేడాది బోరు కింద మూడు ఎకరాల్లో వరిపంటను సాగు చేశాను. పది రూపాయలు మిగిలాయి. ఈ ఏడాది కూడా అలాగే ఉంటుందని ఆశతో నాలుగు ఎకరాల్లో వరినారు పోశాను. కానీ వర్షాలు లేక బోరులో నీరు సరిగా రావడం లేదు. ఈ ఏడాది వరిపంటను సాగు చేయడం కష్టమే అనిపిస్తోంది.

పి.చిన్నయ్య, రైతు, మేకవారిపల్లె, బి.కోడూరు మండలం

సూపర్‌సిక్స్‌పై బాబు యూ టర్న్

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : ఎన్నికల ముందు ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన సూపర్ సిక్స్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు యూటర్న్ తీసుకొంటున్నట్లు స్పష్టమవుతోందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూస్తే భయమేస్తోందని చంద్రబాబు ప్రకటించడాన్ని గమనిస్తే ఆయన సూపర్ సిక్స్‌పై చేతులెత్తేసినట్లు కనపడుతోందని విమర్శించారు. కూటమి భాగస్వామి పవన్‌కల్యాణ్ కనీసం నోరు మెదపడం లేదని నిలదీశారు. సంపద సృష్టించడం అంటే అప్పులు చేయడమేనా? అని గోవిందరెడ్డి ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట తప్పడం చంద్రబాబు నైజమని అన్నారు. కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. రాజధాని పనులకు రూ.15 కోట్లు రుణంగా సమకూరుస్తామని కేంద్రం చెబితే ఏదో ఘనకార్యం సాధించినట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగమే నడుస్తోందని మండిపడ్డారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు : ఉపాధి పనుల్లో నాణ్యతాప్రమాణాలను పాటించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదికను ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా తిరుగుతూ గ్రామీణ ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా గ్రామాలకు వెళ్లి ఉపాధి హామీ పనులను పరిశీలించాలని కోరారు. రైతుల సమస్యలను ఉపాధి హామీ పథకం ద్వారా పరిష్కరించాలని, ప్రధానంగా సబ్సిడీ పథకాలపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఏపీడీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ 2023–24 సంవత్సరంలో మండలంలో 1393 పనులకుగాను రూ.9,29,48,091 ఖర్చు చేశారని తెలిపారు. అడిషనల్ పీడీ నాగరత్నమ్మ, ఎంపీడీఓ కుళ్లాయమ్మ, ఏపీడీ జుబేదా బేగం పాల్గొన్నారు.

లే అవుట్ల యజమానులకు నోటీసులు



లే అవుట్లను పరిశీలిస్తున్న పంచాయతీ అధికారులు

చాపాడు : మండల పరిధిలో అనుమతులు పొందకుండా గృహ నిర్మాణాలకు లే అవుట్లు ఏర్పాటు చేసిన యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన చాపాడులోని అనుమతులు లేని లే అవుట్లను పంచాయతీ సిబ్బందితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాపాడు, పల్లవోలులో అనుమతులు లేకుండా కొంతమంది లే అవుట్లు ఏర్పాటు చేశారన్నారు. గతంలో నోటీసులు జారీ చేసినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లే అవుట్ల యజమానులకు తిరిగి నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. చాపాడులో 64, 74, 75, 76 సర్వే నంబర్లలో ఏర్పాటు చేసిన లే అవుట్లకు నోటీసులు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ధనుంజయబాబు, జానకిరామ్, సచివాలయ సర్వేయర్ తులసీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

పోరుమామిళ్ల : స్థానిక వైష్ణవి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి జంప్‌రోప్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ కల్యాణి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఈనెల 27, 28 తేదీలలో నంద్యాల జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీల్లో ఆరు మంది విద్యార్థులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో ఆగస్టులో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు : ఏపీ టెట్ 2024 కోసం ఉర్దూ మీడియంలో విద్యార్థులకు ఏపీ ప్రభుత్వ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సీఈడీఎం) ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఎస్.ఇమామ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరు జిన్నా రోడ్డులోని మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 25వ తేదీ వరకు 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని ఆయన పేర్కొన్నారు. ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు అప్లికేషన్ జిరాక్స్ కాపీ తీసుకుని రావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9440703867, 9030874612 సంప్రదించాలని తెలిపారు.

అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ

బద్వేలు అర్బన్ : బాలికలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ సూచించారు. వ్యక్తుల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంలో భాగంగా మంగళవారం స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహం–1లో విద్యార్థినులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు యుక్త వయస్సులో ఎంతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించాలని సూచించడంతో పాటు దాని వలన ఏవిధంగా మోసపోతారు అనే విషయంపై అవగాహన కల్పించారు. బాలికలు చదువుకోవడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే తల్లిదండ్రులకు గాని ఉపాధ్యాయులకు గాని హాస్టల్ వార్డెన్‌కు గాని సమాచారం అందించాలని సూచించారు. అలాగే సమాచారహక్కు చట్టం గురించి వివరించారు. తొలుత హాస్టల్ వసతులను, వంటశాలను తనిఖీ చేసి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శ్రీలక్ష్మీదేవి, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీఏ సురేష్ కుమార్

రాజుపాళెం : రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలని ప్రొద్దుటూరు వ్యవసాయ శాఖ ఏడీఏ సురేష్ కుమార్ అన్నారు. మండల కేంద్రమైన రాజుపాళెంలోని మణ్యం ఆగ్రో ఏజన్సీస్ ఆవరణంలో మంగళవారం సాయంత్రం బయోఫ్యాక్టర్ కంపెనీ ఆధ్వర్యంలో డీఏపీ, ఎన్‌పీకే, బయోపొటాష్, జీవమ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా వ్యవసాయంలో పద్ధతులు మారుతూ వస్తున్నాయని, దానికనుగుణంగా రైతులు మారాలని సూచించారు. పంటల్లో రసాయనిక ఎరువులు వేయడం వలన పొలాలు దెబ్బతింటున్నాయని, దీంతో భూమిలో ఉండే సేంద్రీయ కర్బనం తగ్గిపోతోందని తెలిపారు. దీంతో పంటలు పండకుండా పోతున్నాయని చెప్పారు. ప్రొద్దుటూరు ఏఓ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పంటలకు ఆర్గానిక్, జీవ ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు మండల మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవ రెడ్డి, కొట్టాల రంగారెడ్డి, డీలర్లు కృష్ణకిషోర్, మనోజ్, బయోఫ్యాక్టర్ సీఈఓ లక్ష్మీనారాయణ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

రాజుపాళెం : గ్రామాల్లో నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని పెద్దముడియం, రాజుపాళెం మండలాల పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ఎ.వెంకటేశ్వర్లు సూచించారు. మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలోని పశు వైద్యశాలలో మంగళవారం రాష్ట్రీయ గోకుల మిషన్ కింద ఉచిత పశువైద్య శిబిరాన్ని కడప డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ రమేష్ ప్రారంభించారు. గర్భకోశ వ్యాధులు, ఎద సూది, తదితర వ్యాధుల గురించి డాక్టర్ రమేష్ రైతులకు అవగాహన కల్పించారు. పశువులకు గాదెగూడూరు డాక్టర్ ప్రదీప్ కుమార్ రెడ్డి, డీఎల్‌డీఏ డాక్టర్ శివరామిరెడ్డి, జేవీఓ సిద్దేశ్వరిలు చికిత్సలు చేసి మందులను అందించారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు



ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణ

బద్వేలు అర్బన్ : పర్యావరణానికి హానికలిగించే ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు దుకాణాలు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పలు దుకాణాల్లో వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో వాడుతున్న నిషేధిత పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లు వినియోగించకుండా సహకరించాలన్నారు. ప్రజలు కూడా జనపనార, గుడ్డ సంచులను వినియోగించడం అలవాటు చేసుకోవాలని కోరారు. బేకరిలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు, తోపుడుబండ్లపై తినుబండారాలు విక్రయించే వ్యాపారులు కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా.. సోదాలు నిర్వహిస్తున్న సమయంలో పలువురు వ్యాపారులు మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ముందస్తు హెచ్చరికలు జారీ చేయకుండా, పెద్ద వ్యాపారులను వదిలేసి చిన్న దుకాణాలపై దాడులు చేయడం సరికాదని వాదించారు. కార్యక్రమంలో సచివాలయ శానిటరీ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు పాతర



శ్రీరాములపేట నాలుగు రోడ్ల కూడలిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్

ప్రొద్దుటూరు : నిబంధనలకు నిలువునా పాతరేస్తూ ఎలాంటి అనుమతులు లేకుండానే పట్టణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టడం పలు విమర్శలకు దారి తీస్తోంది. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి రోడ్లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను ఓ వైపు తొలగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా కొత్త నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. స్థానిక శ్రీరాములపేట నాలుగు రోడ్ల కూడలి వద్ద నిబంధనలను ఉల్లంఘించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆటు కోనేటి కాలువ వీధి, ఇటు శ్రీరాములపేట మెయిన్‌రోడ్డుకు వైపు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతోంది. కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించిన నిబంధనలు పాటించకుండా, సెట్ బ్యాక్ వదలకుండా, పార్కింగ్ స్థలం లేకుండా రోడ్డుపైకే సన్ సైడ్ నిర్మిస్తున్నారు. ఈ విషయంపై అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు. గత మున్సిపల్ సమావేశంలో కూడా షాపింగ్ కాంప్లెక్స్ నిబంధనల అమలుపై సభ్యులు ప్రధానంగా చర్చించారు. పట్టణంలోని ప్రధాన రోడ్లపై నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లకు సంబంధించి పార్కింగ్‌కు అనుమతులు మాత్రం తీసుకుంటూ సౌకర్యాలు కల్పించడం లేదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

వసతులు లేక విద్యార్థుల అవస్థలు

పోరుమామిళ్ల : సగిలేరు గురుకుల పాఠశాలలో కనీస సదుపాయాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సభ్యులు గంగన్న, ఫణిరావు, శ్రీనివాసులు, షకీలా ఆరోపించారు. మంగళవారం సగిలేరు గురుకుల పాఠశాలను హ్యూమన్ రైట్స్ సభ్యుల బృందం సందర్శించింది. అనంతరం వారు మాట్లాడుతూ భోజనం అధ్వాన్నంగా ఉందని, తాగేందుకు నీరు లేదని, వంటలన్నీ నాసిరకంగా ఉన్నాయని తెలిపారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. వెంటనే విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

అట్లూరు : అట్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మండల బాలకృష్ణ సోదరుడు మండల రామకృష్ణ (65) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. అయితే విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ మంగళవారం రామకృష్ణ మృతదేహానికి నివాళులు అర్పించి.. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయలు బోవిళ్ల చిన్నసూరారెడ్డి, డీలర్ కృష్ణారెడ్డి, సిద్దవటం పెంచల్‌రెడ్డి, గోపాల్‌తో పాటు స్థానిక నాయకులు ఉన్నారు.

పరామర్శ

పోరుమామిళ్ల : మండలంలోని మార్కాపురంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమల రామకృష్ణారెడ్డిని మంగళవారం ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి పరామర్శించారు. రామకృష్ణారెడ్డి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స తీసుకొని.. ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న నాగార్జునరెడ్డి రామకృష్ణారెడ్డిని పరామర్శించారు. ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ జీకే, నాయకులు సీతారామిరెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

వరిలో కాలిబాటలతో అధిక దిగుబడులు

కలసపాడు : వరి సాగులో కాలిబాటలు తీయడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ తెలిపారు. మంగళవారం ఎగువ తంబళ్ళపల్లె గ్రామంలో రైతుల సోముల ఆదిరెడ్డి పొలంలో కాలిబాటలు తీసి వరినాట్లు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలిబాటల వలన ఎక్కువ గాలి, వెలుతురు వరిపంటకు సోకడం వలన మొక్కల్లో కిరణజన్యసంయోగక్రియ బాగా జరిగి అధిక దిగుబడి పొందే అవకాశం ఉందన్నారు. చీడపీడల ఉధృతి కూడా తగ్గుతుందని తెలిపారు.

ముఖ్యంగా సుడిదోమ వలన ఆశించే దోమపోటును తగ్గించవచ్చన్నారు. అలాగే ఎరువులు, పురుగు మందులు వాడటానికి, పైరు పరిస్థితి గమనించడానికి కాలిబాటలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఏఏ మునికుమారి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రామకోటి, లక్ష్మి, నాగేష్ పాల్గొన్నారు.

తెల్ల పశువులకు లంపిస్కిన్ టీకాలు

కలసపాడు : మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం తెల్ల పశువులకు (ఎద్దులు, ఆవులు) లంపిస్కిన్ జబ్బు రాకుండా ముందు జాగ్రత్తగా ఉచితంగా టీకాలు వేశామని మండల పశువైద్యాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంపిస్కిన్ వ్యాధి వలన పశువు చర్మంపై దద్దుర్లు ఏర్పడి కాళ్లు, మెడ భాగంలో నీరు చేరి పశువు చనిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు తప్పకుండా ఇంటి వద్ద ఉండి పశువులకు వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు మండలంలో 250 పశువులకు వ్యాక్సిన్ వేశామని తెలిపారు.

కత్తెరపురుగు నివారణపై అవగాహన

అట్లూరు : రైతులు సాగు చేస్తున్న సజ్జ, జొన్న, మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బద్వేలు వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ అవగాహన కల్పించారు. మండల పరిధిలోని అట్లూరు గ్రామంలో సజ్జ, మొక్కజొన్న, జొన్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. పంటలను కత్తెరపురుగు ఆశించిందని, సంబంధిత నివారణ మందులను పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం అట్లూరులోని మహాలక్ష్మి ట్రేడర్స్ పురుగు మందుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాణ్యమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయించాలని, రైతులకు కొన్న వాటికి రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం అట్లూరులోని రైతుసేవా కేంద్రంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.